

పీసా మొబలైజర్ల అడ్రస్ ఎక్కడ...
వారు ఉన్నట్టా లేనట్టా..

3లో..

www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

అక్రమ మద్యం విక్రయాలపై
మీడియాలో వరుస కథనాలు...



4వ పేజీల్లో

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 183, మంగళవారం 4-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam



# నిమ్స్ మన జెమ్స్

## రోబోటిక్ శస్త్ర చికిత్సల్లో అరుదైన ఘనత

- మూడేళ్లలోపే వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు
- 90 శాతానికి పైగా ఉచిత సేవలు
- నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు

### ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం



నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్ లో ఇప్పటివరకు నిర్వహించిన రోబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రోబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

# బీహార్‌లో భాజపాకు భారీ షాక్

## సొంత గడ్డపై బీజేపీ జాతీయ అధ్యక్షుడికి ఓటమి

- ఆయన ఖాళీ చేసిన నియోజకవర్గంలో ప్రశాంత్ కిషోర్ ఘన విజయం
- మూడింట రెండు ఓడిపోయిన బీజేపీ

**పాట్నా, ఆగస్టు 3:**

నీట్ పేపర్ లీక్ తర్వాత ఢిల్లీ జంతర్ మంతర్‌తో సహా దేశ వ్యాప్తంగా జరిగిన జెన్ జీ ఉద్యమం ఎఫెక్ట్.. బీజేపీ పార్టీపై గట్టిగానే పడింది. జెన్ జీ ఉద్యమం తర్వాత జరిగిన మూడు రాష్ట్రాల్లోని.. మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఫలితాలు వచ్చాయి. ఈ మూడు రాష్ట్రాలు బీజేపీ పాలనలోనే ఉండటం విశేషం. బీహార్‌లో కీలకమైన బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఘన విజయం సాధించారు. కంచుకోటలో బీజేపీని మట్టికరిపించారు. తొలిసారి ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. అలాగే ఆయన పార్టీకి తొలి ఎన్నికల విజయాన్ని సొంతం చేశారు. సోమవారం జరిగిన కౌంటింగ్‌లో ప్రశాంత్ కిషోర్ 63,203 ఓట్లు సాధించారు. 44,250 ఓట్లు పొందిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాను 18,953 ఓట్ల తేడాతో ఓడించారు. ఆర్జేడీ అభ్యర్థి రేఖా గుప్తా 14,085 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. కాగా, తొలి ఎన్నికల పోటీలో గెలిచిన తర్వాత ప్రశాంత్ కిషోర్ మీడియాతో మాట్లాడారు. బంకీపూర్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన తక్షణ ప్రాధాన్యత అని తెలిపారు. 'ఈ విజయం తర్వాత మా మొదటి ప్రాధాన్యత బంకీపూర్ ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని, మాకు అందించిన ఆశీర్వాదాలను గౌరవించడం. బంకీపూర్ అభివృద్ధికి సాధ్యమైనంత కృషి చేస్తాం. రాబోయే రెండు మూడు నెలల్లోనే ఆ మార్పులు మీకు కనిపిస్తాయి' అని అన్నారు. మరోవైపు అతిగా ఆశలు పెట్టుకోవద్దని బంకీపూర్ నియోజకవర్గం ప్రజలకు ప్రశాంత్ కిషోర్ సూచించారు. ఎమ్మెల్యేగా తన ఎన్నిక బంకీపూర్‌ను 'రాత్రికి రాత్రే బెంగళూరుగా' మార్చదని అన్నారు. అయితే రాబోయే కొద్ది నెలల్లోనే స్పష్టమైన అభివృద్ధి పనులు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు. కాగా, ఈ తీర్పు బీజేపీ నాయకత్వానికి ఒక రాజకీయ సందేశాన్ని ఇచ్చిందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. 'బీహార్ ముఖ్యమంత్రిగా ఒక మంచి వ్యక్తిని నియమించాలని బాంకీపూర్ ప్రజలు బీజేపీ నాయకత్వానికి స్పష్టమైన సందేశాన్ని పంపారు. ఎంపికయ్యే వ్యక్తి సమర్థుడై, నిజాయితీపరుడై ఉండాలి. అసలు ముఖ్యమైన విషయం బీహార్ అభివృద్ధి' అని ఆయన అన్నారు.





## అంతర్జాతీయ దొంగల ముఠా అరెస్ట్

- పలు రాష్ట్రాల్లో దోపిడీ, దొంగతనాలు
- నిందితులు బంగ్లాదేశ్‌కు చెందినవారే
- సహకరించిన స్వదేశీయుడు తరుణ్ సింగ్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

12లో..



న్యాయం గెలుస్తుంది' అన్న మాట నిజమే కావచ్చు... కానీ..

## మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్ నిర్దోషిగా తీర్పు

2లో..

## జార్ఖండ్‌లో జేపీఎస్సీ పేపర్ లీక్ కలకలం

- పరీక్ష రద్దు, సీబీఐ విచారణకు విద్యార్థుల డిమాండ్
- నిరాహార దీక్షకు దిగిన విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో
- రాంచీలో ఉద్ధృతంగా కొనసాగుతున్న ఆందోళనలు
- విద్యార్థుల పోరాటానికి కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు



2లో..

## కాక్రోచ్ విద్యార్థి ఉద్యమం ఒక కేస్ స్టడీ

### ఆర్ఎస్ఎస్‌లో అంతర్మథనం

- సీజేపీ నిరసనలు దేశ, రాజ్యాంగ వ్యతిరేకమని విమర్శ
- నీట్ పేపర్ లీక్ ఉద్యమం వామపక్ష శక్తుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపణ

2లో..

**న్యూఢిల్లీ :**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవలే కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసనలు 'దేశ వ్యతిరేకమైనవని', 'రాజ్యాంగ విరుద్ధమైనవని' రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సంయుక్త ప్రధాన కార్యదర్శి అతుల్ లిమాయే అభివర్ణించారు. ఈ ఆందోళనను ఒక 'కేస్ స్టడీ'గా పరిగణించి, దానిపై లోతైన అధ్యయనం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన ఏబీవీపీ కార్యకర్తల సమావేశంలో అతుల్ లిమాయే ప్రసంగించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థుల్లో మొదట వ్యక్తమైన ఆగ్రహం సహజమైనదేనని, అయితే కాలక్రమేణా ఆ ఉద్యమం అసాంఘిక శక్తుల చేతుల్లోకి మిగతా 2లో..

## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం

#### ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:**

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.



## కర్ణాటక మంత్రివర్గ విస్తరణ

- 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం
- మొదటిసారిగా 7 మంది ఎస్సీ నేతలకు కేబినెట్‌లో చోటు
- ఏకైక మహిళా నేతగా గాయత్రి శాంతెగౌడ

2లో..



## కేవలం 175 నిమిషాల్లో.. అగ్గిపెట్టెలో చీర

- వరల్డ్ రికార్డ్ సాధించిన సిరిసిల్ల నేతన్న
- ఐదున్నర మీటర్ల పొడవుతో.. మగ్గంపైనే ఈ చీర



**సిరిసిల్ల, ఆగస్ట్3:**

సిరిసిల్ల నేతన్న మరో అద్భుతాన్ని ఆవిష్కరించాడు. కేవలం మూడున్నర గంటల్లోనే చీరను తయారుచేసి రికార్డ్ సృష్టించాడు . పూర్తిగా మగ్గం పైనే ఈ చీరను నేసి.. ఆశ్చర్య పరిచాడు. ఐదున్నర మీటర్ల పొడవుతో తయారు చేశాడు. తయారు చేసిన చీరను అగ్గి పెట్టెలో..పెట్టి.. తన కళా నైపుణ్యాన్ని చాటి చెప్పాడు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ ఈ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. సాంప్రదాయ చేనేత మగ్గంపై కేవలం (2 గంటల 50 నిమిషాల్లో) 5.5 మీటర్ల పొడవు, 45 అంగుళాల వెడల్పు గల పూర్తి చేనేత చీరను నేశారు. అనంతరం అదే చీరను ప్రత్యేకమైన నైపుణ్యంతో, 12 సెం.మీ. పొడవు, 6.5 సెం.మీ. వెడల్పు, 2.5 సెం.మీ. ఎత్తు గల అగ్గిపెట్టెలో ఇమిడే విధంగా ప్రదర్శించారు. ఇంత పెద్ద చీరను అవలీలగా అగ్గిపెట్టెలో పెట్టాడు. పూర్తిగా మగ్గం ద్వారానే చీరను తయారు చేశాడు. ఎలాంటి విశ్రాంతి తీసుకోకుండా.. ఈ చీరను రూపొందించారు. సహజంగా.. ఒక చీరను తయారు చేయాలంటే, మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతుంది. కానీ. ఈయన మాత్రం మూడున్నర గంటల్లోనే చీరను తయారు చేశాడు. ఇలాంటి రికార్డు ఎవరు చేయలేదు. హరి ప్రసాద్.. ఈ రికార్డు కోసం సంవత్సరం పాటు ప్రాక్టీస్ చేశారు. దీంతో ఎలాంటి అలసట లేకుండా, పూర్తిగా ఏకాగ్రతతో ఈ మిగతా 2లో..

## పశ్చిమాసియాలో చల్లారిన ఉద్రిక్తతలు

2లో..

## జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి

- అరకొర నోటిఫికేషన్లు ఎందుకు..?
- నోటిఫికేషన్లు అడిగితే ఎండ్రిన్ తాగమంటారా?
- సీఎం రేవంత్ పై కేటీఆర్ ధ్వజం



**హైదరాబాద్, ఆగస్టు 3 :**

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఉద్యోగాల భర్తీ విషయంలో యువతను నిరాశపరిచిందని మిగతా 2లో..

## సహజీవనం... చట్టబద్ధమే

- భాగస్వామి వేధింపులపై 498ఏ కింద కేసు నమోదు చేయొచ్చు
- పెళ్లి పేరుతో సహజీవనం చేసి హింసిస్తే శిక్ష తప్పదు
- చట్టబద్ధ వివాహం లేదనే కారణంతో రక్షణ నిరాకరించలేం

2లో..



## విద్యార్థులపై కేసులు ముందుకు తీసుకెళ్లం

- ఎలాంటి బలవంతపు చర్యలు ఉండవు.. సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టీకరణ
- ఇచ్చిన హామీని కచ్చితంగా అమలు చేయాలని ధర్మాసనం ఆదేశం
- ఎఫ్ఐఆర్‌ల పూర్తి ఉపసంహరణకు విద్యార్థి సంఘాల డిమాండ్

# నా విద్యార్హతలు...రుణాలు తెరిచిన కాగితం

- బోస్టన్ వర్సిటీలో చదవడంపై వారికెందుకంత కచ్చ
- బిజెపి నేతలు కూడా వారి విద్యార్హతలు తెలిపితే మంచిది
- ఆర్‌టిఐ ద్వారా సమాచార ప్రశ్నకు అభిజిత్ దీప్కే ఘాటు స్పందన

**ముంబై, ఆగస్టు 3 ):** బీజేపీ కార్యకర్త ఒకరు సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా తన విద్యార్హత వివరాలను కోరడంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే స్పందించారు. బీజేపీ నేతలు కూడా కూడా తమ విద్యకు సంబంధించిన డిగ్రీలను బహిరంగపరచాలని సవాల్ చేశారు. 'నా స్కాలర్‌షిప్ లేఖ, విద్యారుణ లేఖను వెల్లడించడానికి నేను సిద్ధంగా ఉన్నా. చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా అని అభిజిత్ ప్రధాని మోదీ విద్యార్హతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ నాయకులు కూడా తమ విద్యార్హతలను బహిరంగపరుస్తారా? అని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. 'ఒక బీజేపీ కార్యకర్త నాపై ఆర్‌టిఐ దాఖలు చేసి, నా చదువు ఎలా పూర్తి చేశానో తెలుసుకోవాలనుకుంటున్నట్లు ఇప్పుడే చూశాను. మీ నాయకులు వారి డిగ్రీని చూపిస్తారా అని అడిగినప్పుడు మీరు అదే ఆయనను నేను అడగాలనుకుంటున్నా అని అన్నారు. మరోవైపు తన విద్యా నేపథ్యం ఎందుకు ఒక సమస్యగా మారింది? అని అభిజిత్ ప్రశ్నించారు. 'ఒక సాధారణ యువకుడు బోస్టన్ యూనివర్సిటీలో చదివితే వారికెం బాధ. విద్య పట్ల మీకెందుకంత వ్యతిరేకత? అని నిలదీశారు. బోస్టన్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్, విద్యా రుణంతో తన చదువు కోసం ఆర్థిక సహాయం పొందినట్లు ఆయన వివరించారు. విద్యా రుణం తిరిగి చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై వివరణ జరుపవచ్చని దీప్కే అన్నారు. నీట్ లీక్ వివాదంపై నిరసన ఉద్యమానికి నేతృత్వం వహించడానికి జూన్‌లో భారత్‌కు ఆయన తిరిగి వచ్చారు.

# సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్లాక్ దక్కడం సంతోషకరం

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు, తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల-2 బ్లాక్ సింగరేణి సొంతమైన సందర్భంలో.. ఖఇక్షఅ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఇక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థ మణుగూరు ఖఇక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇక్కడ దొరికే జి-8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు

## వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**అన్ని శాఖల అధికారులను ఆదేశించిన సిఎస్**

**హైదరాబాద్,ఆగస్టు 3 :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ప్రాధాన్యత కలిగినవని, దేశ స్వాతంత్ర్య స్ఫూర్తికి తగిన విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని సైనిక స్మారక్ వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తారని, అనంతరం హైదరాబాద్ గోల్కొండ కోటలోని రాణీ మహల్ లాన్స్‌లో నిర్వహించే ఈ వేడుకలకు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని సిఎస్ తెలిపారు. వేడుకల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

'న్యాయం గెలుస్తుంది' అన్న మాట నిజమే కావచ్చు... కానీ..!

# మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసు

**ఢిల్లీ, ఆగస్టు 3 :** రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ చీఫ్, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో భారీ ఊరట లభించింది. ఆరుగురు మహిళా రెజ్లర్ల ఫిర్యాదు మేరకు నమోదైన లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌తోపాటు.. డబ్ల్యూఎఫ్ఐ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసిన వినోద్ తోమర్‌లను ఢిల్లీ న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అశ్విని పన్వర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో వాదనలు విన్న న్యాయస్థానం గురువారం తన తుది తీర్పును రిజర్వ్ చేసింది. మహిళా రెజ్లర్ల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు బ్రిజ్ భూషణ్‌పై 2023 జూన్ 15న ఛార్జ్‌షీట్ నమోదు చేశారు. ఐపీసీ 354, 354ఏ, 354డీ, 506 సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది.
2024 మే నెలలో బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపులు, నేరపూరిత బెదిరింపుల కింద అభియోగాలు నమోదు చేయాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. అయితే ఆరుగురు ఫిర్యాదుదారుల్లో ఒకరు చేసిన ఆరోపణల నుంచి ఆయనకు విముక్తి కల్పించింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌పైనా అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ సమయంలో బ్రిజ్ భూషణ్, తోమర్ ఇద్దరూ బెయిల్ మీద బయట ఉన్నారు. మూడేళ్ల క్రితం భారత ప్రముఖ రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ.. నిరసనలు చేపట్టడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో రెజ్లర్లు చేపట్టిన ఆందోళన అప్పట్లో దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది. రెజ్లర్లపై వేధింపులకు పాల్పడేందుకు తన లభించిన ప్రతి అవకాశాన్ని బ్రిజ్ భూషణ్ ఉపయోగించుకున్నాడని ఢిల్లీ పోలీసులు 2023 సెప్టెంబర్లో కోర్టుకు తెలిపారు.

# జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి

**హైదరాబాద్ :** రాష్ట్రంలో నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. "రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటి? ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. సీఎం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**రేవంత్ విద్యార్హతపై అనుమానాలు**

"రేవంత్ రెడ్డి అసలు ఏం చదివారో కూడా నాకు అనుమానంగానే ఉంది. ఎవరి సహాయం లేకుండా ఆయన తన ఎన్నికల అఫిడవిట్ నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూ అయినా ఫేస్ చేశారా? అసలు విద్యార్థుల కష్టాలు, వారి శ్రమ రేవంత్ రెడ్డికి ఏం తెలుసు?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సంక్షోభం వచ్చినా, కేంద్రం నుంచి నిధులు ఆగిపోయినా నిరుద్యోగుల కోసం 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా 2 లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారో సీఎం రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కేవలం 175 నిమిషాల్లో..అగ్గిపెట్టెలో చీర

చీరను తయారు చేశారు. చీర తయారు చేస్తున్న సమయంలో స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి తిలకించారు. చీర తయారీ తర్వాత అతన్ని అభినందించారు. ఆగస్టు 7న చేనేత దినోత్సవ సందర్భంగా రికార్డు నెలకొల్పారు. తోటి నేత కార్మికులు అభినందించారు. భారతీయ చేనేత సంప్రదాయానికి, తెలంగాణ చేనేత కళాకారుల నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తుందని హరి ప్రసాద్ చెబుతున్నారు . చేనేత రంగానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడం, యువతలో చేనేతపై ఆసక్తి పెంపొందించడం కోసం ఈ రికార్డు నెలకొల్పినట్లు తెలుపుతున్నారు. సిరిసిల్ల నేతన్నల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

# కాక్రోచ్ విద్యార్థి ఉద్యమం ఒక కేస్ స్టడీ

వెళ్లిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "సీజేపీ ఆందోళన వెనుక ఉన్న పనితీరు, దానికి అందుతున్న మద్దతు, దాని సైద్ధాంతిక నేపథ్యం గురించి కూలంకషంగా అర్థం చేసుకోవాలి. జూన్ 20 తర్వాత ఈ నిరసనలు ఒక్కసారిగా ఏ విధంగా ఉద్ధృతమయ్యాయి అనేది గమనించాలి" అని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసనలకు మద్దతు పలికిన సంస్థల్లో అత్యధికం వామపక్ష భావజాలం ఉన్నవేనని లిమాయే ఆరోపించారు. "భారత్ తేరే తుక్డే తుక్డే" వంటి వివాదాస్పద నినాదాలు చేసే బృందాలతో సంబంధమున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) వంటి సంఘాలు ఈ ఆందోళనల్లో క్రియాశీలకంగా వ్యవహరించాయని ఆయన తెలిపారు. విభిన్న రంగాలకు చెందిన ఇన్ని సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన శక్తులు ఎవరని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 38 మందికి..

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య (సవరణ) బిల్లు-2026కు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 34 నుంచి 38కు పెంచేందుకు జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం అంశాలపై విపక్ష సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేయడంతో బిల్లుపై ఎలాంటి చర్చ జరగలేదు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం సభ్యులను మాట్లాడాలని స్పీకర్ ఓం బిర్లా కోరినా ఆందోళనలు కొనసాగడంతో బిల్లును నేరుగా ఓటింగ్‌కు పెట్టగా సభ ఆమోదించింది. ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ విపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా సభ తిరస్కరించింది.
బిల్లు ఆమోదంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో దాదాపు లక్ష కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతి ఏడాది వేల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో న్యాయమూర్తుల సంఖ్య పెంపుతో కేసుల పరిష్కారం వేగవంతమవుతుందని తెలిపారు. పెండింగ్ కేసుల భారం తగ్గించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి

- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయం
- మొన్న నైనీ ప్రారంభించాం, నిన్న తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు సంపాదించాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క



**మణుగూరు ఆగస్టు 3 :** ప్రజా ప్రభుత్వంలో సింగరేణి పరిరక్షణ, విస్తరణతోపాటు రాష్ట్ర ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న సంకల్పంతో గత 30 నెలలుగా అవిశ్రాంతంగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తూ సింగరేణికి కొత్త ఊపిరి లభిస్తోందని, ఈ రోజు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు ఏరియా అస్తిత్వానికి అతి కీలకమైన పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని కాపాడుకోవడానికి కొత్త బ్లాక్‌లను దక్కించుకోవాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు.. సింగరేణికి అందిస్తున్న సహకారం వల్లే ఈ రోజు ఈ విజయం సాధ్యమైందన్నారు. అసలు ప్రారంభం అవుతుందా లేదా తెలియని స్థితిలో ఉన్న ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌కు అనుమతులు సాధించేందుకు తానే ఒడిశాకు వెళ్లి అక్కడి ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి ఒప్పించానని, ఫలితంగా ఈ రోజు 36 ఏళ్ల పాటు సంస్థకు బలమైన పునాది వేసే నైనీలో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. అదే సమయంలో 2013 లో యూపీఏ హయాంలో మైనింగ్ అనుమతులు జారీ చేసిన తాడిచర్ల -2 బొగ్గు బ్లాక్‌ను గత బీఆర్ఎస్ పాలకులు విస్మరిస్తే తాము అధికారంలోకి వచ్చాక కేంద్రంతో సంప్రదింపులు జరిపి గత నెల రెండో వారంలో మైనింగ్ లీజులు జారీ చేయించామని తెలిపారు. ఈ గని ద్వారా 336 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను 45 ఏళ్ల పాటు వెలికితీయడానికి అవకాశం ఉంటుందన్నారు. తాజాగా ఈరోజు (సోమవారం) కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన వేలంలో సింగరేణి పాల్గొని మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ ను దక్కించుకుందని, గత పాలకులు సింగరేణి సంస్థను వేలంలో పాల్గొనకుండా నిరోధించి మన రాష్ట్రంలోని విలువైన బొగ్గు బ్లాక్‌లను వారి అస్మదీయులకు కట్టబెట్టే కుట్రలు చేశారని, తాము సింగరేణి మనుగడ కోసం వేలంలో పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వడం వల్లే ఈ రోజు సింగరేణికి దాదాపు 12 ఏళ్ల తర్వాత వేలంలో ఒక బ్లాక్ దక్కిందని తెలిపారు. ఇది ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో నమోదైన ప్రజా విజయంగా అభివర్ణించారు.
గత నెల రోజుల వ్యవధిలో సింగరేణిలో నమోదైన రెండో అతి పెద్ద విజయంగా పేర్కొన్నారు. మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ గనితో 120 మిలియన్ టన్నుల నాణ్యమైన జీ-8 గ్రేడ్ బొగ్గును వెలికితీయొచ్చని, ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గును మన విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు. మరీ ముఖ్యంగా, సింగరేణిలో అత్యంత కీలకమైన ఏరియాల్లో ఒకటైన మణుగూరు ఏరియా అస్తిత్వాన్ని పరిరక్షించడంలో ఈ బ్లాక్ కీలక పాత్ర పోషించనుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 2 వేల మందికి పైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి భద్రత లభించడమే కాకుండా, మణుగూరు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే, ఈ బ్లాక్‌లోని నాణ్యమైన బొగ్గు నిల్వల ద్వారా రాబోయే 20 సంవత్సరాల పాటు తెలంగాణ విద్యుత్ అవసరాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేయడంతో రాష్ట్ర ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.
గత ప్రభుత్వ హయాంలో సింగరేణి ప్రయోజనాల పరిరక్షణలో తగిన చొరవ చూపకపోవడం వల్ల కోయగూడెం-3 మరియు సత్తుపల్లి-3 వంటి కీలక బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. ప్రజా ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాలనే కేంద్రబిందువుగా తీసుకుని ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటోందని స్పష్టం చేశారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు నిల్వలను సంస్థకు అందించడం, ఉద్యోగ భద్రతను పెంపొందించడం, తెలంగాణ విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలికంగా బొగ్గు సరఫరా భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ దక్కడంపై సింగరేణి యాజమాన్యానికి, కార్మిక సంఘాల నాయకులకు, కార్మికులందరికీ అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో గతంలో ప్రైవేట్ పరమైన కోయగూడెం -3 బ్లాక్, సత్తుపల్లి -3 బ్లాక్‌ల ను కూడా సింగరేణికి దక్కేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కేవలం మన రాష్ట్రానికే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు గనుల సాధన, ఇతర క్రిటికల్ మినరల్స్ అన్వేషణలోనూ సింగరేణి విస్తరించడానికి కార్యచరణ ప్రణాళికను రూపొందించుకొని ముందుకు వెళుతున్నదని తెలిపారు.

# ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కస్టడీ కోరుతూ పిటిషన్

**హైదరాబాద్,ఆగస్టు 3 :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణా రెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏడు రోజులపాటు కస్టడీకి కోరారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. మరో ఇద్దరి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీల కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్టాలో పరిచయమైన మరో యువతికి ఉదయ్ పెళ్లి ప్రతిపాదనలు పంపినట్లు గుర్తించారు. ఆ యువతి స్టేట్‌మెంట్‌ను ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. మరోవైపు ఉప్పరపల్లి కోర్టులో ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై మధ్యాహ్నం కోర్టు విచారణ చేపట్టనుంది. పోలీసు కస్టడీ పిటిషన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# సహజీవనం... చట్టబద్ధమే

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** సహజీవనం (లివ్-ఇన్ రిలేషన్‌షిప్)లో ఉన్న మహిళలకు కూడా చట్టపరమైన రక్షణ వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ భాగస్వామిని మానసికంగా లేదా శారీరకంగా వేధించిన వ్యక్తిపై భారతీయ శిక్షాస్మృతిలోని (ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితకు సంబంధించిన నిబంధనలు) సెక్షన్ 498ఏ కింద క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చని తీర్పు వెలువరించింది. వివాహం జరగలేదనే కారణంతో బాధిత మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కుకు విరుద్ధమని పేర్కొంది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. సహజీవనం చేస్తున్న వ్యక్తిని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో భర్తతో సమానంగా పరిగణించవచ్చని, అలాంటి వ్యక్తి వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేడని స్పష్టం చేసింది.
అయితే అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని ధర్మాసనం పేర్కొంది. వివాహం చేస్తానని నమ్మబలికి సహజీవనం కొనసాగిస్తూ హింసకు పాల్పడిన సందర్భాల్లోనే ఈ రక్షణ వర్తిస్తుందని వివరించింది. అలాగే ఇలాంటి కేసుల్లో ప్రాథమిక విచారణ పూర్తి చేయకుండా వెంటనే అరెస్టులు చేయవద్దని పోలీసులకు సూచించింది. సెక్షన్ 498ఏ ఉద్దేశం మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల వేధింపుల నుంచి రక్షించడమేనని, అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒకే తరహా సంబంధంలో ఉన్న మహిళల్లో వివాహితకు మాత్రమే రక్షణ కల్పించి, సహజీవనంలో ఉన్న మహిళకు రక్షణ నిరాకరించడం సమానత్వ సూత్రానికి విరుద్ధమని పేర్కొంది. జీవిత భాగస్వామిని ఎంచుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమని, ఆ స్వేచ్ఛను వినియోగించుకున్న మహిళకు కూడా చట్టపరమైన రక్షణ సమానంగా లభించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

# విద్యార్థులపై కేసులు ముందుకు తీసుకెళ్లం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :** జంతర్‌మంతర్ వద్ద గత నెల జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్‌ఐఆర్‌లపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న గత హామీకి కట్టుబడి ఉన్నామని కేంద్రం ధర్మాసనానికి తెలిపింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ, కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ అమలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై ఎలాంటి బలవంతపు లేదా అనవసర చట్టపరమైన చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది. ఇప్పటికే విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కూడా ధర్మాసనం గుర్తుచేసింది. ఇప్పటికే నమోదైన ఎఫ్‌ఐఆర్‌ల దర్యాప్తు అంశం కోర్టు పరిశీలనలో ఉండగా, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే విషయంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. మరోవైపు విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సంఘాలు అన్ని ఎఫ్‌ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నాయి.

# ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

**రాంచీ :** ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయరక్షణ కోసం తామూ కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.

# జార్ఖండ్‌లో జేపీఎస్‌సీ పేపర్ లీక్ కలకలం



**రాంచీ, ఆగస్టు 3:** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీక్, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో రాష్ట్ర రాజధాని రాంచీలో విద్యార్థుల ఆందోళనలు ఉద్ధృతమయ్యాయి. పరీక్షను వెంటనే రద్దు చేయడంతో పాటు మొత్తం వ్యవహారంపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో పారదర్శక సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్రభుత్వం, జేపీఎస్‌సీకి పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతోనే దీక్షకు దిగాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విద్యార్థుల డిమాండ్లపై స్పందించి చర్యలు తీసుకునే వరకు తన దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత నెల జేపీఎస్‌సీ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదలైన తర్వాత పేపర్ లీక్‌కు సంబంధించిన ఆధారాలను ప్రభుత్వానికి సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ పరీక్షలకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని, నియామక ప్రక్రియలో సమూల మార్పులు అవసరమని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనకు కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు ప్రకటించింది. పార్టీ నేత అభిజిత్ దీప్కే నిరసనకారులను కలిసి సంఘీభావం ప్రకటిస్తూ, వారి న్యాయమైన డిమాండ్లకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం రాంచీలో విద్యార్థుల నిరసనలు కొనసాగుతుండగా, ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




# కర్ణాటక మంత్రివర్గ విస్తరణ

- 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం
- మొదటిసారిగా 7 మంది ఎస్సీ నేతలకు కేబినెట్‌లో చోటు
- ఏకైక మహిళా నేతగా గాయత్రి శాంతెగౌడ

**బెంగళూరు, ఆగస్టు 3 :** కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన మంత్రివర్గాన్ని భారీగా విస్తరించింది. కాంగ్రెస్ అధిష్టానం ఆమోదం తెలపడంతో 20 మంది నూతన నాయకులను కేబినెట్‌లోకి తీసుకున్నారు. సామాజిక సమతుల్యత, అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఎస్సీ, ఎస్టీ, లింగాయత్, వొక్కలిగ, మైనారిటీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారు. బెంగళూరులోని లోక్‌భవన్‌లో ఈ సాయంత్రం నూతన మంత్రుల ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది.

**కేబినెట్‌లో కులాల వారీ ప్రాతినిధ్యం**

రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా 7 మంది ఎస్సీ నేతలకు కేబినెట్‌లో చోటు దక్కింది. వీరిలో ఎస్సీ-రైట్ నుంచి ముగ్గురు, ఎస్సీ-లెఫ్ట్ నుంచి ఇద్దరు, లంబానీ, భోవి వర్గాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వీరితో పాటు ముగ్గురు ఎస్టీ (గా) వర్గానికి చెందిన నేతలకు స్థానం లభించింది. లింగాయత్ సామాజిక వర్గం నుంచి 7 మంది, వొక్కలిగ సామాజిక వర్గం నుంచి 5 మంది మంత్రులు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ముస్లిం సమాజానికి చెందిన నలుగురికి కీలక పదవులు లభించాయి. ముగ్గురు కేబినెట్ మంత్రులుగా ఎంపికవ్వగా, మరొకరు శాసనమండలి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇతర వెనుకబడిన తరగతుల నుంచి 5 మందికి మంత్రివర్గంలో చోటు కల్పించారు.

**నూతన మంత్రుల జాబితా**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించిన జాబితా ప్రకారం: పి.ఎం. నరేంద్రస్వామి, శివరాజ్ తంగడగి, రుద్రప్ప లామణి, కె.ఎస్. బసవంతప్ప, బి. నాగేంద్ర, టి. రఘుమూర్తి, బి.జెడ్. జమీర్ అహ్మద్ ఖాన్, రిజ్వాన్ అర్షద్, సంతోష్ లాడ్, మధు బంగారప్ప, పుట్టరంగశెట్టి, మంకాల్ వైద్య, అజయ్ సింగ్, ఎన్. చెలువరాయ స్వామి, కె.ఎమ్. శివలింగే గౌడ, హెచ్.సి. బాలకృష్ణ, గాయత్రి శాంతెగౌడ, బసవరాజ్ రాయరెడ్డి, విజయానంద్ కాశప్పనవర్, లక్ష్మణ్ సవది మంత్రులుగా ప్రమాణం చేశారు. మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న ఏకైక మహిళా నేతగా గాయత్రి శాంతెగౌడ నిలిచారు.

# వేణుకుమార్ కుటుంబానికి నామ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయం





- దయచేసి నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు - మాజీ ఎంపీ నామ విజ్ఞప్తి
- బాధిత కుటుంబాన్ని ఆదుకున్న మాజీ ఎంపీ నామను అభినందించిన యువత

రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకుడు జీ. వేణుకుమార్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆదివారం బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆస్పత్రికి వెళ్లి వేణుకుమార్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన విషయం తెలిసిందే. పరామర్శ సందర్భంగా వేణుకుమార్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నామ చలించిపోయి తన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల రూపాయలు సోమవారం మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ట్రస్ట్ ప్రతినిధి కనకమేడల సత్యనారాయణ చేతుల మీదుగా వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం వేణుకుమార్ నాయనమ్మకు ధైర్యం చెబుతూ "నేను అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చిన నామ, చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ పరామర్శించిన మరుసటి రోజే ఆర్థిక సాయం అందించడం విశేషం. క్లిష్ట సమయంలో నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ బాధిత కుటుంబానికి అండగా నిలిచింది. నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని నామ పేర్కొన్నారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, నిరుద్యోగ యువత ధైర్యంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆపద సమయంలో అండగా నిలిచి వెంటనే ఆర్థిక సహాయం అందించిన నామకు వేణుకుమార్ కుటుంబ సభ్యులు, నిరుద్యోగ యువత కృతజ్ఞతలు తెలిపారు.

**వేణుకుమార్ ఒక్కడి సమస్య కాదు.. లక్షలాది నిరుద్యోగుల ఆవేదన: కమల్‌రాజు**

ఈ సందర్భంగా కమల్‌రాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి మోసం చేస్తోందని విమర్శించారు. 31 నెలల పాలనలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. వేణుకుమార్ ఆత్మహత్యాయత్నం నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని, నిరుద్యోగులు పడుతున్న వేదనకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేణుకుమార్ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు వారి నామా ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, వేణుకుమార్ కోలుకున్న అనంతరం అతనికి అవసరమైన కోచింగ్‌తో పాటు ఇతర అవసరాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే గ్రూప్స్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం వేణుకుమార్ ఒక్కరి సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది నిరుద్యోగుల సమస్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి ప్రసాద్‌రావు, గడ్డం వెంకటేశ్వర్లు, వాకదాని కోటేశ్వరరావు, పెనుగొండ కొండలు, నామ వ్యక్తిగత కార్యదర్శి నాగరాజు, బీఆర్ఎస్ యువజన నాయకులు రేగళ్ల కృష్ణప్రసాద్, పగడాల రవికుమార్, షారుఖ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో సత్తా చాటిన త్రివేణి విద్యార్థులు



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):** ఖమ్మంలోని TNGO ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన South India Open Karate Championship--2026 పోటీలలో త్రివేణి టాలెంట్ స్కూల్, ఖమ్మం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు విభాగాల్లో విజేతలుగా నిలిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.

**ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు:**
1.ఎన్. భవిష్య (5వ తరగతి), 2.జె. జాస్మిక (5వ తరగతి ), 3.కె. భవిష్య (5వ తరగతి )
4.జె.జస్వంత్ (7వ తరగతి), 5.బి. కీర్తన -- Weapon (B గ్రూప్)9వ తరగతి
6.పి. రోహిత్ సంజయ్ రాజ్ -- Kumite (A గ్రూప్)9తరగతి
7.డి. విఘ్నేశ్వర్ రెడ్డి -- Kumite (B గ్రూప్)7వ తరగతి

**ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులు:**
8.ఎ. యోగిత (6వ తరగతి), 9.కె. హితేష్ గుప్తా (7వ తరగతి), 10.పి.హర్షిత (4వ తరగతి )
11.వి. బెన్సన్ రాజ్ (C గ్రూప్)6వ తరగతి

**తృతీయ స్థానం సాధించిన విద్యార్థులు:**
12.ప్రజ్వల్ సాయి (5వ తరగతి), 13.బెనోని పి. (7వ తరగతి ), 14.బి. యువతేజ శ్రీ (5వ తరగతి)
15.బి. దేవాన్ని (5వ తరగతి ), 16.బి. మౌన్విత (6వ తరగతి)

ఈ సందర్భంగా విజేతలందరినీ త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీ గొల్లపూడి వీరేంద్ర చౌదరి ప్రత్యేకంగా అభినందిస్తూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, కరాటే శిక్షకుల అంకితభావమే ఈ విజయానికి కారణమని పేర్కొంటూ, కరాటే కోచ్ వీరన్నకు,విజేతలందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా,సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ,క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ -ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొని విజేతలను ఘనంగా అభినందించారు. త్రివేణి విద్యార్థుల ఈ విజయం పాఠశాలకు మరో మైలురాయిగా నిలిచింది.

## పదవి విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):** దీర్ఘకాలంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఘనంగా సన్మానించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూలై 31 నాటికి పదవి విరమణ పొందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ లో అసిస్టెంట్ సిడిపిఓ గా పని చేస్తున్న జే.రత్నకుమారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయ డ్రైవర్ సి.హెచ్. నాగరాజు పదవి విరమణ వేడుకలు బాగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సుమారు 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు , సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత వారు జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు పదవి విరమణ పొందిన వారినీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, డిడబ్ల్యుఓ ఏ.ప్రమీల, జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీలలో రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాల విద్యార్థుల ప్రతిభ




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):** 31 వ ఇంటర్ స్కూల్స్ జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ - 2026 సుమన్ సోలోకాన్ స్పోర్ట్స్ కరాటే - డు అకాడమి ఇండియా, ఖమ్మం వారు పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కరాటే విభాగం లో ఖమ్మం నగరంలోని స్థానిక వి.డి.హోస్ కాలనిలో గల రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ లో 6వ తరగతి చదువుతున్న వై.సాయి పరిక్ష, జి. లాస్య మరియు 5వ తరగతి చదువుతున్న వైష్ణవి, పవనియా పూర్వికులు సిల్వర్ మరియు బంగారు పతకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ ఆర్.వి నాగేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు ఇంత చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు పాఠశాల కో డైరెక్టర్ నీలిమ. పతకాలు ప్రశంసాపత్రాలు బహుకరిస్తూ కొనియాడారు. డైరెక్టర్ కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా కో కరిక్యులర్ యాక్టివిటీస్ లో ఉత్సాహంగా పాల్గొంటూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ స్కూల్ కి మంచి పేరు ప్రఖ్యాతులు సాధిస్తారని కొనియాడారు ఇంత చక్కటి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కోచ్ ని ప్రిన్సిపల్ టి. గోపాలకృష్ణ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.

## పిల్లలలో అభ్యసన ఫలితాల సాధనే ధ్యేయంగా పనిచేయండి

- జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం





**కామేపల్లి,ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):** విద్యార్థుల అభ్యసన ఫలితాల సాధనే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం జిల్లా అకాడమిక్ అధికారి ప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని సోమవారం ముచ్చర్ల- జాస్తి పల్లి హైస్కూల్ ను వారు సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేస్తున్న మధ్యాహ్న భోజనం ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట పాత్రలను కూడా శుభ్రం చేసుకున్న తర్వాత మాత్రమే వంట ప్రారంభించాలని సూచించారు.పక్కపక్కనే ఉన్న ముచ్చర్ల జాస్తిపల్లి ప్రాథమిక పాఠశాలల పిల్లలను ఒకే దగ్గర ఉంచి బోధనాభ్యాసన ప్రక్రియలను నిర్వహించాలని మండల విద్యా శాఖ అధికారి కి సూచించారు.ఆ పాఠశాలల హెచ్ఎం లు,ఏఏపీసి సర్పంచ్ ల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు.

## పొన్నెకల్ భూ సేకరణ గ్రామసభకు హాజరైన డిప్యూటీ కలెక్టర్





**కామేపల్లి,ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండలంలోని పొన్నెకల్ గ్రామంలో జరిగిన ఎస్ ఆర్ ఎల్ ఐ పి పంపిణీ కాల ప్యాకేజీ గ్రామ సభకు భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ సదానందం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసే కన్నా తక్కువ గురించి వివరించారు.పెగ్ మార్క్ మార్కింగ్ పని ప్రారంభమైందని అధికారులు ఆయనకు వివరించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరావు,ఆర్ ఐ విజయ భాస్కర్ గ్రామ సర్పంచ్ గుగులోత్ భూమిక తదితరులు పాల్గొన్నారు.

# పీసా మొబలైజర్ల అడ్రస్ ఎక్కడ...

# వారు ఉన్నట్టా లేనట్టా..

- ఏజెన్సీ గ్రామ పంచాయతీల్లో వారే కీలకం... అయినా వారు కనబడరు... అధికారులు పట్టించుకోరు...



**కామేపల్లి,ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన గ్రామపంచాయతీలో కీలక విధులు నిర్వహించాల్సిన పీసా మొబలైజర్లు... అడ్రస్ లేకుండా పోయారు.... వారు కనపడరు... అధికారులు పట్టించుకోరు ...ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు అవగాహన కల్పించడానికి గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో పీసా మొబలైజర్ల ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏజెన్సీ లోని ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కరిని నియమించారు. వీరు గ్రామ పంచాయతీల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి గ్రామ సభలకు గిరిజనులు హాజరయ్యేటట్లు చూడాలి గ్రామ సభలను బలోపేతం చేయడానికి సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం ఉపాధి హామీ పథకం,గిరిజన సంక్షేమ పథకాలు గ్రామ సభల ద్వారా జరిగేటట్లు చూసి గిరిజనులకు అవగాహన కల్పించడం పిసా మొబలైజర్ల బాధ్యత భూమి,ఆటవి హక్కులు, గిరిజనుల ఇతర సమస్యలను గ్రామసభలో చర్చించి అనుమతులు తీసుకోవటం గ్రామాల్లో ఎస్ హెచ్ జి,వాటర్ కమిటీలు,స్కూల్ కమిటీలను గ్రామ సభ ఆధీనంలోకి తేవడం వీరి ప్రధాన బాధ్యత... ఇంతటి కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సిన పీసా మొబలైజర్లు గ్రామాల్లో కనీసం కనిపించిన దాఖలాలు లేవు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారుల లెక్కల ప్రకారం కేవలం 10 గ్రామాలకే పీసా మొబలైజర్లు ఉన్నట్లు మిగతా 14 గ్రామ పంచాయతీ లకు లేరని మండల అధికారులు తెలిపారు.ఈ గ్రామ పంచాయతీలో ఉన్న పిసా మొబలైజర్లు కనీసం ఆయా గ్రామ పంచాయతీలు నిర్వహించే గ్రామసభల్లో సర్పంచులు అధికారుల కంటికి కనిపించడం లేదు. వారిని గైడ్ చేయాల్సిన అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. ఇళ్ల వద్ద కూర్చొని ఈ మొబలైజర్లు జీతాలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. దీనిపై మండల పంచాయతీ అధికారి వివిఎస్ శాస్త్రి ని వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని గ్రామపంచాయతీలో ప్రతిరోజు వారు హాజరైనట్లు చర్యలు తీసుకుంటామని ఉల్లంఘించిన వారికి షోకాజు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.మీరు మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు తీసుకున్న ఐదు నెలల తర్వాత వారిపై తీసుకున్న చర్యల గురించి ప్రశ్నించగా ఇప్పుడు చర్యలు తీసుకుంటానని చెప్పడం కోస మెరుపు

## మహిళా గ్రామసభ, బాలల గ్రామసభ నిర్వహణ

- జీపీడీపీ ప్రణాళికలపై విస్తృత చర్చ
- సర్పంచ్ బానోత్ హిరాలాల్




**కారేపల్లి, ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో సోమవారం సర్పంచ్ బానోత్ హీరాలాల్ అధ్యక్షతన మహిళా గ్రామసభ, బాలల గ్రామసభతో పాటు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రాధాన్య అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో కలిసి విస్తృతంగా చర్చించారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, మహిళా సంక్షేమం, బాలల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను జీపీడీపీలో చేర్చి ప్రాధాన్యత క్రమంలో అమలు చేయాలని నిర్ణయించారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు సర్పంచ్ హీరాలాల్ తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బిక్కులాల్ , వాంకుడోత్ గాంధీ , గ్రామపంచాయతీ కార్యదర్శి పెంట్ల అనిల్ కుమార్ , ఆశా వర్కర్స్ , అంగన్‌వాడీ సిబ్బంది, వార్డు సభ్యులు కిషన్, నగేష్, గ్రామస్తులు గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
మంగళవారం
4 । ఆగస్టు । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# మానల ప్రభాకర్ బీనామీగ ఉన్న దడిగెల శ్రీను ల దోపిడి నీ అరికట్టాలి

**– సి పి ఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య చంద్ర అరుణ డిమాండ్**






**గుండాల ఆగస్టు 3 భద్రాద్రి న్యూస్ :** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు 3వ తారీకు సోమవారం. పెట్రోల్ బంక్ సెంటర్లో మండల జనరల్ బాడీ జరపడం జరిగింది ఈ జనరల్ బడి కి గుండాల మాజీ సర్పంచ్ కొమరం శాంతయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య గారు రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ లు మాట్లాడుతూ గుండాల మండలం పూర్తిగా ఏజెన్సీ మండలం ఇక్కడ ఐదవ షెడ్యూల్ 1/70 చట్టం అమల్లో ఉంది కాబట్టి పోడు భూమి ఎక్కువ ఉన్న ప్రాంతం ఇక్కడ పెట్టుబడి రైతులకు ఇస్తూనే దాని మూసుకులో అప్పులు ఇచ్చి ఆస్తులు తీసుకోవడం చట్టానికి విరుద్ధం ఈ ప్రాంతంలో ఈ విషయం అవలంబించడం సరైనది కాదు కనుక మానాల ప్రభాకర్. ఆయన బినామీ దడిగల శ్రీను. ఈ ప్రాంతంలో కొంత మంది పేదలకు అప్పులు పెంటి ఇల్లు ఆస్తులు గుంజు కోవడం సరిఅయింది కాదు. చట్ట విరుద్ధంగా వ్యాపారం చేస్తూనే అమాయక ప్రజలను వాడుకుంటే ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఒక విప్లవ పార్టీగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తుంది. చట్టా ని మరియు ఐక్యతను కాపాడాలని పిలుపునిస్తోంది. కార్యక్రమంలో. జిల్లా నాయకులు మాచర్ల సత్యన్న డివిజన్ కార్యదర్శి ఈసం శంకరన్న. మండల నాయకులు తెల్ల రాజు. పూణేం లక్ష్మన్న పుణ్యం మంగయ్య. కోడూరు జగన్. మోకాల అజాద్ సనప కుమార్ యనగంటి గణేష్. రమేష్ ఈసం చంద్రన్న వుకే బాబు. కల్తి పాపన్న. రామన్న. దుర్గం లక్ష్మీనారాయణ ఎట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు భూదానం..

***పేరేపల్లి అంగన్వాడీ భవన నిర్మాణానికి 200 గజాల స్థలం విరాళం***



**కారేపల్లి, ఆగస్టు 03 (భద్రాద్రి న్యూస్--రాములు):** కారేపల్లి మండలం పేరుపల్లి-2 అంగన్వాడీ కేంద్రానికి పర్సా సూర్యప్రకాశరావు కుటుంబ సభ్యులు 200 గజాల భూమిని దానం చేశారు. దీనికి సంబంధించి దానపత్రాలను పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రంకు పర్సా కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ స్థలంలో అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి అనుమతి ఇస్తూ పంచాయతీ పాలకవర్గం ఆమోదించిన తీర్మానాన్ని సోమవారం ఐసీడీఎస్ అధికారులకు సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి బానోత్ పద్మావతి వీరభద్రం మాట్లాడుతూ.. చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విలువైన భూమిని దానం చేసిన పర్సా సూర్యప్రకాశరావు--ఛాయాదేవి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సత్యశీల, అంగన్వాడీ ఉపాధ్యాయినులు సుశీల, సీత, విజయ తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చర్ల టు ఏనుకూర్ ఆర్ అండ్ బి రోడ్ ను పునర్ నిర్మించాలి





**కామేపల్లి,ఆగస్టు 3 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల క్రాస్ రోడ్ నుండి ఏన్కూర్ వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే మరమ్మతు ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ మండల నాయకుడు బాదావత్ శ్రీను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముచ్చర్ల క్రాస్ రోడ్డు నుండి ఏన్కూరు--వరకు ఉన్న ప్రధాన రహదారిని తక్షణమే మరమ్మతు చేయాలని సీపీఎం మండల నాయకుడు బాదావత్ శ్రీను ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఆయన గత ఐదేళ్ళుగా ఈ రహదారి దయనీయ స్థితిలో ఉందని,రోడ్డు మరమ్మతుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, నిరసనలు నిర్వహించడంతో పాటు సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రతిరోజూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనిద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురై క్రింద పడటంతో దానితోపాటు యాక్సిడెంట్ అవ్వడం ద్వారా కాళ్లు,చేతులు విరగొట్టుకుంటున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిని ఇకనైనా అధికారులు వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి సంబంధిత అధికారులను నిలదీస్తామని బాదావత్ శ్రీను హెచ్చరించారు.

# వైరాలో ఘనంగా చిన్నారి శ్రేష్ట మొదటి పుట్టినరోజు వేడుకలు

**- చిన్నారి శ్రేష్టకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన లయన్స్ సభ్యులు**



**వైరా, ఆగస్టు 3, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ బస్టాండ్ ఎదురుగా పాత కూరగాయల మార్కెట్ రోడ్ లో సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మోదుగు బాలకృష్ణ ( బాలు), ప్రశాంతి దంపతుల కుమార్తె శ్రేష్ట మొదటి పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా వారి గృహంలో నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావు, వైరా సబ్ ఇన్స్పెక్టర్ పుష్పాల రామారావు, 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, దుర్గాప్రసాద్ దంపతులు, లయన్స్ రంగా సత్యనారాయణ, వాసవి దంపతులు రాయపూడి వెంకటేష్ రజిని దంపతులు, సీనియర్ పాత్రికేయులు కొత్త వెంకటేశ్వరరావు, లయన్స్ సభ్యులు నల్లమోతు లక్ష్మీనారాయణ, వై. బుచ్చి రామారావు, దోసపాడు రవి, నాగరాజు లు హాజరై చిన్నారి శ్రేష్ఠను ఆశీర్వదించి పాపకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పేద విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు పూయించిన దాతృత్వం..!

**- రాళ్లపురం పాఠశాల చిన్నారులకు కొత్త దుస్తులు అందించిన నిరంజన్--సౌజన్య దంపతులు**





**చర్ల ఆగస్టు 3 భద్రాద్రి న్యూస్ :** నేటి కాలంలో చాలామంది సామాజిక బాధ్యతలను విస్మరిస్తున్న వేళ, నిరంజన్--సౌజన్య దంపతులు తమ సేవా భావంతో ఆదర్శంగా నిలిచారు. చర్ల మండలంలోని రాళ్లపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు కొత్త దుస్తులను పంపిణీ చేసి చిన్నారుల ముఖాల్లో ఆనందాన్ని నింపారు. కొత్త దుస్తులు అందుకున్న విద్యార్థులు ఉత్సాహంగా కనిపించగా, గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దాతలను హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా నిరంజన్--సౌజన్య దంపతులు మాట్లాడుతూ, రాళ్లపురం గ్రామంలోని విద్యార్థులు సరైన దుస్తులు, వసతులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తమ మిత్రుడు మద్ది లక్ష్మీనరసింహారెడ్డి ద్వారా తెలుసుకుని వెంటనే సహాయం చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. "విద్యే గ్రామీణాభివృద్ధికి పునాది" అని పేర్కొన్న వారు, విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందితే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి అవసరమైన వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. చర్ల మండల యువ నాయకులు బోరా పెద్దిరెడ్డి, పరిటాల సంతోష్ మాట్లాడుతూ, నిరంజన్--సౌజన్య దంపతుల సేవా కార్యక్రమం సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ఇలాంటి దాతలు పెరిగితే పేద విద్యార్థుల భవిష్యత్తు మరింత వెలుగొందుతుందని అన్నారు. దుస్తులు అందుకున్న విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేయగా, గ్రామస్తులు కూడా ఈ సేవా కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు షబీనా, మద్ది లక్ష్మీనరసింహారెడ్డి, గడ్డం సాయి, సృజన్, కొట్టే నవీన్, మూషిక ప్రవీణ్, బాలరాజు, అంగయ్య, భీమయ్య, ఉంగయ్య, గ్రామస్తులు, తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.

# అమరజీవి సున్నం రాజయ్య ఆశయాలే నేటికీ పోరాటాలకు దిక్సూచి..!

**- ఆదివాసీల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేతకు ఘన నివాళులు**




**చర్ల, ఆగస్టు 3 భద్రాద్రి న్యూస్ :**
ఆదివాసీల హక్కుల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేసి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అమరజీవి కామ్రేడ్ సున్నం రాజయ్య ఆరవ వర్ధంతిని చర్ల మండల కేంద్రంలోని బీస్ రామయ్య భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు బందెల చంటి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సున్నం రాజయ్యకు భావోద్వేగపూర్వకంగా నివాళులర్పించారు.
ముందుగా సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు సున్నం రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "సున్నం రాజయ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి, ప్రజాసేవ నేటికీ ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకం. నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువెత్తు ప్రతిరూపంగా నిలిచిన ఆదివాసీ ముద్దుబిడ్డ సున్నం రాజయ్యను ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మరువలేరు" అని అన్నారు.
ఈ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిచి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడు సున్నం రాజయ్య అని పేర్కొన్నారు. పోడు భూములకు పట్టాలు, పేదలకు ఇంటి స్థలాలు, ఆదివాసీల అటవీ హక్కుల సాధన కోసం ఆయన సాగించిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. నిరుపేదలకు ఉపాధి భరోసా కల్పించిన ఉపాధి హామీ చట్టం అమలుకు కూడా ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.
"ఈ ప్రాంతంలో నేడు కనిపిస్తున్న అభివృద్ధి, ఆదివాసీలకు లభించిన అనేక హక్కులు, ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పుకు సున్నం రాజయ్య చేసిన పోరాటాలే బలమైన పునాది. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే గొప్ప నివాళి" అని మచ్చ రామారావు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బందెల చంటి, పొడుపుగంటి సమ్మక్క, భీమగాని నవీన్ కుమార్, దొడ్డి హరినాగవర్మ, ఉడుగుల షారోను, వరదల వరలక్ష్మి, కట్టం స్పందన, కొట్టే నవీన్, బోయిళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొని అమరజీవి సున్నం రాజయ్య సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

# వైన్ షాపుల సిండికేట్ దోపిడీపై ఉక్కుపాదం మోపాలి

**- అధిక ధరల విక్రయాలు, బెల్టు షాపులకు అక్రమ సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవాలి: న్యాయవాది బోడ వినయ్ కుమార్**



**కారేపల్లి, ఆగస్టు 3(భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలంలో వైన్ షాపుల యజమానులు సిండికేట్‌గా వ్యవహరిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే అధిక ధరలకు మద్యం విక్రయించడం, గ్రామాల్లోని అక్రమ బెల్టు షాపులకు ఆటోల ద్వారా మద్యం సరఫరా చేయడం వంటి వ్యవహారాలపై ఆబ్కారీ శాఖ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాది బోడ వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజలు, పాత్రికేయులు పలుమార్లు అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా, కేవలం నామమాత్రపు తనిఖీలు నిర్వహించి హెచ్చరికలతో సరిపెడుతున్నారే తప్ప, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా కొందరు వైన్ షాపుల యజమానులు యథేచ్ఛగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ, గ్రామాల్లోని అక్రమ బెల్టు షాపులకు ప్రతిరోజూ ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయించడం, లైసెన్స్ నిబంధనలను ఉల్లంఘించడం, అనుమతి లేని ప్రదేశాల్లో మద్యం విక్రయించడం, అక్రమంగా మద్యం రవాణా చేయడం వంటి చర్యలు తెలంగాణ ఎక్సైజ్ చట్టం--1968లోని 34, 36, 41 సెక్షన్ల ప్రకారం శిక్షార్హమైన నేరాలు అని పేర్కొన్నారు. అదేవిధంగా తూనికలు, కొలతల చట్టం--2009లోని 18, 36 సెక్షన్ల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు వస్తువులను విక్రయించడం కూడా చట్టవిరుద్ధమని తెలిపారు. అలాంటి వారిపై జరిమానాలు, ఇతర చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు తమ విధులను నిర్లక్ష్యం చేస్తే, భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని 223వ సెక్షన్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని న్యాయవాది తెలిపారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వైన్ షాపుల లైసెన్సులను రద్దు చేసే అధికారం ఆబ్కారీ శాఖకు ఉందని, అందువల్ల జిల్లా ఆబ్కారీ అధికారులు, ప్రాంతీయ ఆబ్కారీ కమిషనర్, ఆబ్కారీ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించని పక్షంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భారత రాజ్యాంగంలోని 226వ అధికరణం ప్రకారం తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు న్యాయవాది బోడ వినయ్ కుమార్ తెలిపారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ఆబ్కారీ శాఖ ప్రధాన కార్యదర్శి, ఆబ్కారీ కమిషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా ఆబ్కారీ సూపరింటెండెంట్, సంబంధిత ఆబ్కారీ ఇన్స్పెక్టర్, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్ షాపుల యజమానులను ప్రతివాదులుగా చేర్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి మండలంలో మద్యం సిండికేట్ దందా, అధిక ధరల వసూళ్లు, బెల్టు షాపులకు అక్రమ సరఫరాపై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అక్రమ మద్యం విక్రయాలపై మీడియాలో వరుస కథనాలు...

**అయినా అధికారుల చర్యలు శూన్యమా?**

**- ప్రజల ఫిర్యాదులు ఒకవైపు... మీడియాలో కథనాలు మరోవైపు... అయినా మార్పు ఎక్కడ?**

**- "మా కుటుంబాలు నాశనం అయిన తర్వాతే స్పందిస్తారా?" అంటూ సింగరేణి మండల ప్రజల ఆవేదనలి**





కారేపల్లి,ఆగస్టు 3, (భద్రాద్రి న్యూస్ రాములు ) :సింగరేణి మండలం లో అక్రమ మద్యం విక్రయాలపై గత కొంతకాలంగా మీడియాలో వరుస కథనాలు వెలువడుతున్నాయని, ప్రజలు కూడా పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."మీడియాలో పదేపదే కథనాలు వస్తున్నాయి... ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు... అయినా సమగ్ర తనిఖీలు జరిగాయా? ఫిర్యాదులపై విచారణ చేపట్టారా? చేపట్టితే ఫలితాలను ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదు? అక్రమాలు లేవంటే అధికారికంగా స్పష్టం చేయండి. ఉంటే వాటిని అరికట్టేందుకు తీసుకున్న చర్యలు ఏమిటి?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.గ్రామాలు, కాలనీల్లో అక్రమ మద్యం విక్రయాలపై వస్తున్న ఫిర్యాదుల కారణంగా అనేక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. మద్యం వ్యసనం వల్ల కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయని, మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యువత భవిష్యత్తుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొంటున్నారు.ప్రజల ఆవేదన ఒక్కటే..."మా కుటుంబాలు నాశనం అయిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? మా గోడు వినేది ఎవరు? మీడియా కథనాలు, ప్రజల ఫిర్యాదులు కూడా చర్యలకు దారితీయకపోతే సామాన్య ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? మా బాధను నిర్లక్ష్యం చేయకుండా, వాస్తవాలను వెలికితీసి ప్రజలకు న్యాయం చేయాలి." అని స్థానికులు కోరుతున్నారు.ప్రజలు కోరేది ఆరోపణలు కాదు... పారదర్శక విచారణ.ప్రజలు కోరేది ప్రచారం కాదు... చట్టప్రకారం చర్యలు.అందుకే సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక బృందాలతో సమగ్ర తనిఖీలు నిర్వహించి, అందిన ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణ చేపట్టి, వాస్తవాలను అధికారికంగా ప్రజలకు వెల్లడించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, చట్టం అందరికీ సమానమనే నమ్మకాన్ని నిలబెట్టాలని కోరుతున్నారు. "ప్రజల కన్నీళ్లకు సమాధానం మాటల్లో కాదు... చర్యల్లో కనిపించాలి" అని సింగరేణి మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గ్రామాభివృద్ధికి జిపిడిపి ప్రణాళికే దిక్సూచి

**టేకులగూడెం గ్రామసభలో సర్పంచ్ గుమ్మడి సందీప్**




**కారేపల్లి, ఆగస్టు 3: (భద్రాద్రి న్యూస్ రాములు):** గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే విజయానికి పునాదని, గ్రామాభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) అమలు ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టేకులగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ గుమ్మడి సందీప్ అన్నారు. సోమవారం టేకులగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో గ్రామాభివృద్ధి ప్రణాళిక, బాలలు, బాలికలు, మహిళల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్థానిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, తాగునీరు, సాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని తొమ్మిది ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, ఈవోపే సునీత, మాజీ సర్పంచ్ అనసూర్య, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.